
భరత్‌నగర్ వీధిలో భూమిపూజ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అధికారులు

మోదీ నేతృత్వంలోనే దేశం సమగ్రాభివృద్ధి: కిషన్‌రెడ్డి

నల్లకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోనే దేశం సమగ్రాభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను మోదీ ప్రవేశపెట్టారని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బుర్జుగల్లీలోని హనుమాన్ దేవాలయం వద్ద రూ.6 లక్షల వ్యయంతో పవర్ బోర్‌ను, భరత్‌నగర్ వీధిలో రూ.34.50 లక్షల వ్యయంతో నూతన కమ్యూనిటీహాల్ భూమిపూజ పనులను జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో కోట్ల రూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కవి చంద్రమౌళికి హరివిల్లు జీవన సాఫల్య పురస్కారం


రామకృష్ణ చంద్రమౌళికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

నల్లకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళికి హరివిల్లు జీవన సాఫల్య పురస్కారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో అలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య బుధవారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు వడ్డేపల్లి కృష్ణ, మౌనశ్రీ మల్లిక్, పాలడుగు సరోజినిదేవి, దైవాదీనం, ప్రభాకరాచారి, కె.వరలక్ష్మి, తంగిరాల చక్రవర్తి, గుళ్లపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ.. ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ముందుగా అలూరి విల్సన్ రచించిన హరివిల్లు పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం జరిగింది.

'శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయం'

నల్లకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి తులసీ శ్రీనివాస్ తెలిపారు. మార్చి 2న దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని అధికారికంగా జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆయన మాట్లాడారు. ఫెడరేషన్ కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, వంశీ ద్రోణంరాజు, రవికుమార్, సుబ్బారావు, మంగపతిరావు, వైష్ణవి, ప్రసాద్, రాఘవరావు పాల్గొన్నారు.


అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత మల్లికార్జున్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎన్.మల్లికార్జున్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. మల్లికార్జున్‌రెడ్డికి అంజన్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి స్వాగతిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున తమ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, నాయకులు తిరుమల, బి.యాదగిరిగౌడ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యబస్తీలో కార్పొరేటర్ పర్యటన


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ బుధవారం డివిజన్‌లోని ఎల్లయ్యబస్తీలో వాటర్‌బోర్డ్ మేనేజర్ కృష్ణమోహన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ శంకర్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీలలో తాగునీటి, సీవరేజీ సమస్యలు పరిష్కరించేందుకు జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డితో సమీక్షించి రూ.87 లక్షల నిధులు మంజూరు చేయించామని వివరించారు. ఎల్లయ్యబస్తీలో 2.80 లక్షల రూపాయలతో నూతన సీవరేజ్ లైన్, చిక్కడపల్లి బాపునగర్‌లో 5.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణాలను మరో వారం రోజుల్లో ప్రారంభిస్తామని వివరించారు. బీజేవైఎం నగర పూర్వ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గంగపుత్ర నాయకులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాగేందర్

అందరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నాగేందర్ ఆధ్వర్యంలో గంగపుత్రకాలనీలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతం పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించారు. బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరక్‌నాథ్, రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్, జగదీష్, బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు గోవింద్, కమలాకర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలి


బోర్డ్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కవాడిగూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమలగూడ పీఎస్‌లో అప్సా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయక ఫోన్ నెంబర్స్ బోర్డును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఉచితంగా న్యాయం పొందేందుకు ఈ ఫోన్ నెంబర్స్ ఉపయోగించుకోవాలని కోరారు. అప్సా వంటి సంస్థలు ప్రజలకు ఉచిత న్యాయ సలహాల నుంచి మొదలుకుని ఆపదలో ఉన్న వారికి కావాల్సిన రక్షణ సేవలందించడాన్ని ప్రశంసించారు. 100 పోలీస్ లైన్, చిల్డ్రన్స్ లైన్ 1098, అంబులెన్స్ 108/102, భార్యాభర్తల తగాదాలు పరిష్కరించడానికి 040-27852355, ఉచిత న్యాయ సలహా కోసం 040-23446670లలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, బొట్టు రమేష్ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి

- ఓయూ ఫిజిక్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ శ్రీనివాస్
- ఘనంగా సైన్స్ డే


సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించిన వివేకానంద డిగ్రీ విద్యార్థినులు

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ద్వారానే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఆ దిశగా నేటి విద్యార్థులు ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెమిస్తాన్‌పూర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలల యాజమాన్యం తరుచూ సైన్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ముషీరాబాద్ మండల డిప్యూటీ విద్యాశాఖాధికారి చిరంజీవి, స్కూల్ కరస్పాండెంట్ కటకం రఘు, ప్రిన్సిపాల్ కె.సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు.


అంబేద్కర్ కళాశాలలో సైన్స్ వేడుకల్లో విద్యార్థులు

- విద్యార్థులు తమ ఆవిష్కరణలతో అబ్బురపరిచారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని బాగ్‌అంబర్‌పేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.
- విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డే సం దర్భంగా బుధవారం ఫిజికల్ సైన్స్ విభాగం నుంచి డాక్టర్ జె.చిన్నబాబు ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులతో సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. రసాయన శాస్త్ర విభాగం నుంచి అధ్యాపకులు డాక్టర్ అనిల్‌కుమార్, పి.సురేఖల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రయోగాలను చేసి ప్రదర్శించారు. ప్రదర్శనలను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య, అధ్యాపకులు డాక్టర్ బి.సుచిత్రాసింగ్, డాక్టర్ జె.భారతి, ఎస్.రవిప్రసాద్, కె.నవీనారాణి, డాక్టర్ వి.కల్యాణి సందర్శించారు.

● అంబేడ్కర్ కాలేజీలో..

అంబేడ్కర్ కళాశాలలో ఎంబీఏ సెమినార్ హాల్‌లో సైన్స్ దినోత్సవం సందర్భంగా ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.రుక్మిణి మాట్లాడుతూ.. ఆధునిక జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను కీర్తిస్తూ ఇస్రో ఇటీవల సాధించిన ఘన విజయాలపై వివరించారు.

మెగా డీఎస్సీపై మాటమార్చిన ప్రభుత్వం

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ, పెద్దఎత్తున ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. గెలిచాక మాట మారుస్తూ నిరుద్యోగులను మోసం చేస్తోందని ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. 28 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా 5, 10 వేల ఉద్యోగాలంటూ మోసపూరిత నాటకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. విద్యాశాఖలోని కొంతమంది నిరుద్యోగులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారుల మాటలు నమ్మి ప్రభుత్వం గుడ్డిగా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే టెట్ నిర్వహించి పూర్తిస్థాయిలో టీచర్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. బీసీ నేత ప్రధానిగా ఉన్నా వెనుకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. 60 శాతం బీసీలు పేదరికంలో ఉండగా వికసిత భారత్ పేరుతో బీజేపీ ప్రభుత్వం ఊదరగొడుతుందని మండిపడ్డారు. బీజేపీ బీసీలను చిన్నచూపు చూస్తుందని, ఉన్నత వర్గాలకొమ్ముకాస్తూ న్యాయమైన వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, సి.రాజ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' అనే నినాదంతో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి లక్ష ఓట్ల మెజారిటీ అందించాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సూడో సైన్స్ ఆటంకం

- ప్రొఫెసర్ రామచంద్రయ్య


ప్రొ.రామచంద్రయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సూడో సైన్స్ ఆటంకంగా మారిందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య అన్నారు. శాస్త్రీయ ఆలోచనలు సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తాయన్నారు. సైన్స్ ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సూడో సైన్స్ ప్రజలను అంధకారంలోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులలో చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వం పెంపొందించాలని, సత్యాన్ని శోధించాలని సూచించారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సుమాకాంత్, జనవిజ్ఞాన వేదిక నగర నాయకులు లింగస్వామి, వెంకట్, ఫార్మసీ కళాశాల కెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.విజయభార్గవి, అధ్యాపకురాలు అనుశ్రీ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో ప్రపంచం

- ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డా.వెంకట మోహన్
- అంబేడ్కర్ వర్సిటీలో సైన్స్ డే


డాక్టర్ వెంకట మోహన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం పూర్తిస్థాయిలో కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోందని ఇది భవిష్యత్ తరాల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐ.ఐ.సి.టీ) సీనియర్ శాస్త్రవేత్త డా.ఎస్.వెంకట మోహన్ అన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో వికసిత్ భారత్‌లో భాగంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "సుస్థిర అభివృద్ధి సాంకేతిక జోక్యం"పై కీలకోపన్యాసం చేశారు. వాతావరణంలో కాలుష్య పరిమాణం రోజురోజుకూ పెరుగుతూ ఆందోళన కలిగిస్తోందని ఇది భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారనుందన్నారు. గాలిలో కార్బన్‌డయాక్సైడ్ శాతం ఉండాల్సిన పరిమాణం కంటే ఎక్కువగా నమోదవుతోందని, విపరీతంగా పెరుగుతోన్న జనాభా కూడా దీనికి కారణంగా నిలుస్తుందన్నారు. కాలుష్య కారకాలను తగ్గించక పోతే భవిష్యత్‌లో మానవ మనుగడకే పెద్ద ముప్పుగా నిలుస్తుందన్నారు. వ్యర్థాలు రీ సైకిల్ చేయడం వల్ల కొంతమేర అటు గాలి, ఇటు జల కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయని, అయినా ప్రజల భాగస్వామ్యం లేకుండా పూర్తిస్థాయిలో కాలుష్యాన్ని అరికట్టడం సాధ్యం కాదన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ఐఐసీటీ పరిశోధనలు చేస్తుందని, అనేక పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాల నుంచి వ్యర్థాలను నేరుగా అటు భూమిలోకి ఇటు వాతావరణంలోకి వదలడం ద్వారా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందన్నారు. అంబేడ్కర్ వర్సిటీ ఉపకులపతి ప్రొ.కె.సీతారామరావు మాట్లాడుతూ ఒకవైపు శాస్త్రీయ పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా మరో వైపు మూఢనమ్మకాలు ప్రజలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన అభివృద్ధి సామాన్యులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడ్డప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్, సైన్స్ విభాగ డీన్ ప్రొ.పుష్ప చక్రపాణి మాట్లాడుతూ ప్రఖ్యాత భారతీయ పరిశోధకులు సర్ సి.వి.రామన్ గుర్తుంచుకునేలా ఆయన పేరున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరపడం శుభసూచికమన్నారు.

పది ఎంపీ స్థానాల్లో ఏకం సనాతన్ భారత్‌దళ్ పోటీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పది ఎంపీ స్థానాలకు ఏకం సనాతన్ భారత్‌దళ్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్ చతుర్వేది బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాలకు పోటీ చేయాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోందని ఆయన తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో తమ పార్టీకి లక్ష సభ్యత్వం ఉందన్నారు.

రేపు విజయ సంకల్పయాత్రలో కులవృత్తుల ప్రదర్శన

బర్కత్‌పుర: అంబర్‌పేట నియోజకవర్గంలో మార్చి 1న విజయసంకల్ప యాత్ర చేతి కులవృత్తుల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ తెలిపారు. బుధవారం కాచిగూడ మహేంద్రగార్డెన్‌లో ఓబీసీ మోర్చా అంబర్‌పేట నియోజకవర్గం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ సంకల్పయాత్ర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లగుండా సాగుతుందని, అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా వద్ద ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానంద్ ముదిరాజ్, సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గౌరీశంకర్, విద్యానంద్, ఎస్.నర్సింగ్‌రావు, నియోజకవర్గం కన్వీనర్ ఎస్.వెంకటస్వామిగౌడ్, కార్యదర్శి ఎంపి.కిషోర్, మేరు రమేష్, ధర్మేందర్, రమాకాంత్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే..

బర్కత్‌పుర: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. ఎంతోమంది పేద కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి 35 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ముషీరాబాద్: మొదటి రోజు ఫస్టియర్ ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున తరలి వచ్చి తమ పిల్లలకు ధైర్యం చెపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంజుమన్ జూనియర్ కాలేజీలో 294 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాంనగర్ సెయింట్ పాయిస్ జూనియర్ కాలేజీలో 579 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజర్ అయ్యారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ముషీరాబాద్: శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ పోలీసులకు సహకరించాలని చిక్కడపల్లి ఏసీపీ ఎల్ రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం చిక్కడపల్లి సెంట్రల్ జోన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌కుమార్‌ను భోలక్‌పూర్‌కు చెందిన గౌస్, ఖాజా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏసీపీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో జీవించేందుకు సామాజిక బాధ్యతతో అందరూ చట్టాలకు అనుగుణంగా పని చేయాలన్నారు.

బెంగాళీ నామశూద్రులకు ఎస్సీ హోదా ఇవ్వండి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగాళీ నుంచి వలస వచ్చి స్థిరపడిన నామశూద్రులను ఎస్సీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన పలువురు బెంగాళీ నామశూద్రులతో కలిసి నగరంలోని జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లారు. డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1971లో బంగ్లాదేశ్ నుంచి వేలాది మంది శరణార్థులుగా వచ్చి కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో స్థిరపడ్డారని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో నామశూద్రులను ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎస్సీ జాబితాలో చేర్చేలా కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

కుత్బుల్లాపూర్‌లో అగ్ని ప్రమాదం

- మంగళవారం అర్ధరాత్రి ఘటన
- కాలి బూడిదైన దుకాణాలు


ఎగిసిపడుతున్న మంటలు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పలు దుకాణాలు దగ్ధమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సుచిత్ర-కుత్బుల్లాపూర్ రహదారిలో ఉన్న స్టేట్ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన కొందరు వీధి వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 11.15 గంటల సమయంలో దుకాణాల నుంచి మంటలు వస్తున్నట్లు గమనించిన స్థానికులు జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ప్రధానంగా పండ్ల దుకాణం, మాంసం దుకాణం, స్క్రాప్ దుకాణం, జూస్ పాయింట్‌తో పాటు పలు రకాల దుకాణాలను నిర్వహిస్తున్నారు. పండ్ల దుకాణంలో ఉన్న 4 రిఫ్రిజిరేటర్లతో పాటు పండ్లు, తోపుడు బండ్లు ఇతరత్ర సామగ్రి కాలి బూడిదయ్యాయి. మంటలు సుమారు మూడు అంతస్తుల ఎత్తుకు ఎగసి పడడంతో ఆ వేడికి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా లేక గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం మూసి ఇంటికి వెళ్లేలోపు..

మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పండ్ల దుకాణం మూసివేసి ఇంటికి బయలుదేరాము. మేము ఇంటికి చేరుకునే లోపే దుకాణంలో మంటలు చెలరేగాయని ఫోన్ చేసి చెప్పారు. తిరిగి వచ్చి చూసేసరికి అప్పటికే మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. శివరాత్రి పండుగ దృష్ట్యా మంగళవారం ఉదయమే సుమారు రూ. 4 లక్షల విలువ గల పండ్లను తెచ్చి పెట్టాం. మొత్తం సుమారు రూ. 12 లక్షల విలువ గల ఆస్తి నష్టం జరిగింది.

- సురేందర్ మహర్యు, పండ్ల దుకాణం నిర్వాహకుడు

వ్యక్తి దారుణ హత్య

జీడిమెట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీకాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం, ఔరంగాబాద్, తానా, అజాద్ బింగా గ్రామానికి చెందిన రమేష్‌రామ్(45) కుటుంబసభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జీడిమెట్ల రామిరెడ్డినగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా ఉన్న వినాయక కెమికల్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రమేష్‌రామ్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. రమేష్‌రామ్ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో స్నేహితులతో కలిసి పైప్‌లైన్ రోడ్డులోని ఓవైన్‌షాప్ వద్ద మద్యం తాగారు. రాత్రి ఇంటికి వెళ్లలేదు. బుధవారం తెల్లవారుజామున హెచ్‌ఎంటీ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై కనిపించాడు. రమేష్‌రామ్‌ను వాకింగ్ చేస్తున్న వ్యక్తులు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడి ఒంటిపై దుస్తులు ఊడదీసి ఉన్నాయి. బీరుబాటిళ్లతో తలపై కొట్టిన ఆనవాళ్లున్నాయి. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. రామిరెడ్డినగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దారుణానికి పాల్పడింది హిజ్రాలు అయి ఉంటారేమోనన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



● సత్కారం

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్‌గా నియమితులైన కె.శ్రీనివాస్‌రెడ్డిని సంఘ సేవకుడు సంపత్‌కుమార్, తదితరులు ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి శాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

సికింద్రాబాద్ డీసీసీ కార్యదర్శుల నియామకం


డీసీసీ కార్యదర్శులుగా నియమితులైన వారితో అనిల్‌కుమార్‌యాదవ్

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శులుగా ముషీరాబాద్ నియోజక వర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులను ఆ పార్టీ డీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియమించారు. మాజీ ఎంపీ, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు మహేశ్వరి, మమత, పూజా, తస్లీన్‌బేగం, షాలినీ, మహేష్‌చంద్ర, హేమంత్‌కుమార్‌లను కార్యదర్శులుగా నియమిస్తూ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నియామకపత్రాలను బుధవారం అందజేశారు. అనంతరం అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేస్తున్న వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, లోకేష్‌యాదవ్, సిరాజ్, హర్ష, శేఖర్, శ్రీధర్‌యాదవ్, పవన్ పాల్గొన్నారు.

ఒక్క రూపాయి దుర్వినియోగమైనా ఏ శిక్షకైనా సిద్ధమే..

- మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొ.వెంకట్రావ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్రావ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రస్ట్‌బోర్డులో ఒక్క రూపాయి దుర్వినియోగమైనా ఏ శిక్షకైనా తాము సిద్ధమేనని, ఆరోపణలు రుజువు చేయకపోతే ట్రస్ట్‌బోర్డులో అడుగు పెట్టనీయమని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్రావ్ హెచ్చరించారు. ఇటీవల ట్రస్టీలు ఆకుల పాండురంగారావు, మందా సూర్యప్రకాష్, నిమ్మ శంకర్‌లు ప్రెస్‌మీట్‌లో ట్రస్ట్‌బోర్డుపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. ఆరోపణలు బేషరతుగా ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ట్రస్టీలు తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, యలగందుల దేవేందర్, ఆకుల నగేష్, అమరం చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ట్రస్ట్‌బోర్డును కబ్జా చేసి తమ ఆధీనంలోకి తీసుకోవడానికే ముగ్గురు ట్రస్టీలు కుట్రలు చేస్తూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారు చేసిన ఆరోపణలో ఏ ఒక్కటీ వాస్తవం కాదన్నారు. ట్రస్టీల అభిప్రాయాలకు అనుగుణంగానే యాక్సిస్ బ్యాంకులో ట్రస్ట్ బోర్డు కొత్త అకౌంట్ ప్రారంభించామని, అవార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ఆలస్యం కాకుండా ఉండడానికి ఈ కొత్త అకౌంట్ అని స్పష్టం చేశారు. ట్రస్టీలో అయిదుగురే ఉండాలనే నిబంధన ఏమి లేదన్నారు. ఇప్పటికైనా ట్రస్టీలు చేసిన ఆరోపణలు విరమించుకోవాలన్నారు. ట్రస్ట్‌బోర్డు సేవలను ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. ట్రస్ట్ బోర్డుపై ఆరోపణలు చేసిన ముగ్గురు ట్రస్టీలపై పరువునష్టం దావా వేస్తామని స్పష్టం చేశారు.